

ఆర్మూర్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు



జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆలూర్ రెడ్డి యూత్ సభ్యులు

# మరోసారి మద్దతు ఇచ్చి గెలిపించండి

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- కుల సంఘాలతో సమావేశం

ఆర్మూర్, నవంబర్19: ఆర్మూర్ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు గెలిచి ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పనులు చేపట్టానని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించానని, మరో సారి మద్దతు ఇచ్చి తనను గెలిపించాలని బీఆర్ఎస్ ఆర్మూర్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి కోరారు. ఆలూర్ మండల కేంద్రంలోని మాదిగ, మాల కుల సంఘల సభ్యులతో ఆదివారం వారి సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ, మాల సంఘాల సభ్యులు జీవన్ రెడ్డికి పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, మాల, మాదిగ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఆలూర్ మండలం మచ్చర్లలో ఎన్నికల ప్రచారంలో జీవన్‌రెడ్డి



ఆర్మూర్ పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### మచ్చర్లలో ఇంటింటా జీవన్‌రెడ్డి ప్రచారం

ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చేరుకున్న జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి మూడో సారి ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పదేండ్లలో మచ్చర్ల గ్రామానికి చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మచ్చర్ల – జోరుపూర్ రోడ్డు పనులు పూర్తికాగా జీవన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లకు వెళ్లి జీవన్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, బీఆర్ఎస్ మండలం అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### పట్టణంలోని 16వ వార్డులో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఆర్మూర్‌టౌన్, నవంబర్19: పట్టణంలోని 16వ వార్డులో గడపగడపకూ బీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా పెర్కిట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇట్టెడి గంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మామిడి ఏలియా రెడ్డి, తిరుపతిగౌడ్, గడ్డి కార్తీక్, కొప్పేల అచ్యుత్, నక్క నర్సయ్య, దొంద స్వామి నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో యూత్ సభ్యుల చేరిక

ఆర్మూర్, నవంబర్19: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన రెడ్డీస్ యూత్ సభ్యులు ఆదివారం ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కేసీఆర్, ఆర్మూర్ నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని, గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి జీవన్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డీస్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### పట్టణంలోని యువజన సంఘాల సభ్యులు..

ఆర్మూర్‌టౌన్, నవంబర్19: ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు యువజన సంఘాల సభ్యులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, స్వాతీసింగ్‌బబ్లూ, పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వాహనం తనిఖీ

ఆర్మూర్, నవంబర్19: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఏర్పాటు తనిఖీ కేంద్రం వద్ద ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి వాహనాన్ని ఎన్నికల అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ఎన్నిక అధికారులు ఆపగా జీవన్ రెడ్డి తన వాహనాన్ని నిలిపి బయటికి దిగారు. అధికారులు తనిఖీ చేసేందుకు సహకరించారు. దీంతో పోలీసులు జీవన్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనంతో పాటు కాన్వాయిలోని అన్ని వాహనాలను తనిఖీ చేసి పంపించారు.



జీవన్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

## పెద్దమ్మతల్లికి బోనాలు

మాక్లూర్, నవంబర్ 19: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా బోనాల పండుగను నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

శక్కర్‌నగర్, నవంబర్19: బోధన్ పట్టణం వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాన నక్షత్రం సందర్భంగా కలకుంట్ల శ్రీధరాచారి మంత్రోచ్చారణల మధ్య, ఆలయ అర్చకుడు దీపక్‌పాండే సహకారంతో పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న యాజ్ఞికులు, హాజరైన భక్తులు

## సహస్రార్జున జయంతి..

ఆర్మూర్ టౌన్, నవంబర్19: పట్టణంలోని చిన్న బజారులో ఉన్న లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సహస్రార్జున భగవాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సంఘ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు మధన్‌మోహన్, సంఘసభ్యులు పాల్గొన్నారు.